కొయ్యూరు భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

వేతనాల కోసం మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

ఏటూరునాగారం, మార్చి 21 : వేతనాలు చెల్లించి, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రొయ్యూరు మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ వద్ద శుక్రవారం నాలుగు మండలాలకు చెందిన కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడారు. కార్మికుల వేతనాలు చెల్లించి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడం వల్ల తామ కుటుంబాలు గడవని పరిస్థితిలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడికి వెంటనే ఐడీ కార్డు ఇచ్చి, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు వర్తించేలా చూడాలని కోరారు. రెండేళ్ల నుంచి పెరగాల్సిన వేతనాలు వెంటనే పెంచి ఏప్రిల్ నుంచి అమలు చేయాలన్నారు. ధర్నాలో ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు వసతులు కల్పించాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 21 : నర్సింగ్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన ఐడీవోసీ కార్యాలయంలో వైద్యశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయుష్ భవనంలోని రెండు అంతస్తులను నర్సింగ్ కళాశాల నిర్వహణకు కేటాయించాలని, ప్రధాన ఆసుపత్రికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసి, కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలికంగా భవనం వినియోగంపై కమిషనర్‌తో మాట్లాడుతానని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ నవీన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో మెలుకువలు నేర్చుకోవాలి : ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, మార్చి 21 : పోలీస్ అధికారులు వినియోగిస్తున్న ఆయుధాల పనితీరు పై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శుక్రవారం మామునూరు బెటాలియన్ సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో జిల్లా పోలీస్ అధికారులు ఈ సంవత్సరానికి సంబంధించిన ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు కీలకమని, ఫైరింగ్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. ఫైరింగ్ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, డీఎస్పీ నారాయణ నాయక్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశం

కాటారం, మార్చి 21 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో సంఘం నివేదిక వినిపించి రైతులతో వివిధ అంశాలపై చర్చించారు. నూతన రైతులకు దీర్ఘకాలిక రుణాల మంజూరు, కార్యాలయ భవన మరమ్మతులకు తీర్మానించారు. లవాని పట్టా భూములకు రుణాలు ఇవ్వాలని రైతుల విజ్ఞప్తి మేరకు తీర్మానం చేశారు. పలువురు రైతులు బోనస్ రావడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నామని, రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డైరెక్టర్లు రాజబాబు, సత్యం, అజయ్, రాజేశ్వరి, హిమాకర్, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్, రాజయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

మొగుళ్లపల్లి, మార్చి 21 : మండలంలోని ఇస్సిపేట మాజీ ఉపసర్పంచ్ ఎండిగ నర్సింహారావు తల్లి రాంబాయి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణరెడ్డి ఆ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొడారి రమేశ్‌యాదవ్, మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ WANTED Telecallers in Education Sector. Salary 10,000/- Full time & part time 5,000/- Incentives are 10,000/- per Admission Cont:**9908432153 & 7288826032.**

NTW-6572

WANTED TEACHERS

★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.

NTW-482

WANTED

★**త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు** వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-330663-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్

★ గోపాలపురం (HNK), 0% వడ్డీతో సులభ వాయిదాలతో సొంత ఇంటి కలను సాకారం చేసుకోండి. KUDA Approved గేటెడ్ కమ్యూనిటి ఇండిపెండెంట్ హౌసెస్ (2BHK) సెల్: 6305185315.

NTW-332483

CHANGE OF NAME

★I, **PUSHPALATHA** (Old Name) H.NO. 1 - 1 - 43 / B Door NO.202, 2nd Floor Anurag Enclave, Chaitanyapuri Colony, Hanumakonda Dist. have Changed my name from **PUSHPALATHA** (Old Name) to **PARAKUTTH PUSHPALATHA**(New Name) w/o **SIVARAMAN VENKATAKRISHNAN** for all purposes.

NTW-6573

LOST OF DOCUMENTS

★I **SANJAR UNNISA BEGUM** w/o **Mohammed Hussain,** H No. 14-6-45 Nizampura, Warangal Dist-506002. Lost my Original Gift deed D.NO. 1296/1983 of SRO, Warangal (R.O) while travelling from Nizam pura Mandi bazar to Charbowli On. 15-03-2025 in Auto Rickshaw. If anybody found please inform me.**Cell: 9848886278.**

NTW-6574

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగురూరల్, మార్చి 21 : సమాజానికి పెను సవాల్‌గా మారిన మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర సరిహద్దు మార్గం ద్వారా మత్తు పదార్థాలను చేరవేసే అవకాశం ఉన్నందున అవసరమైన చర్యలు చేపట్టి చెక్‌పోస్టు వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా, ఉత్పత్తి, అమ్మకాలను అడ్డుకోగలిగితే మత్తు పదార్థాలను నియంత్రించవచ్చని తెలిపారు. గ్రామాల్లో విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలు వాడినట్లు దృష్టికి వస్తే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజలు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు.

నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు

యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని నిబంధనల మేరకే కొనుగోలు చేయాలని కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యాసంగిలో 92,113 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లే లక్ష్యంగా 145 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. 17 శాతం తేమతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

రైతులకు వెను వెంటనే ట్రక్‌షీట్లను అందించాలని ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కట్టింగ్‌లు విధించడానికి వీలు లేకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు నష్టం జరగకుండా చూసే బాధ్యత అధికారులదే అన్నారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అదనపు ఎస్పీ సదానందం, ఆర్టీవో శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి షాఫైజల్ హుస్సేనీ, సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, డీసీవో సర్దార్‌సింగ్, ఆర్డీవో వెంకటేశ్, డీఎస్పీ కిశోర్‌కుమార్, నార్కోటిక్ అసిస్టెంట్ కమిషనర్ సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఏవో సురేశ్‌కుమార్, వాణిజ్య పన్నుల శాఖ అధికారి దుమ్ములేశ్వర్, డీపీఆర్వో రఫిక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ పాల్గొన్నారు.

మొదటి రోజు టెన్త్ పరీక్షలు ప్రశాంతం

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు దివాకర, రాహుల్‌శర్మ

ములుగు, మార్చి 21 (నమస్తే తెలంగాణ)/ భూపాలపల్లి రూరల్ : ములుగు, జయశంకర్ భూ పాలపల్లి జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం 10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ములుగు జిల్లాలో 3,134 మంది విద్యార్థులకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, తొలి రోజు తెలుగు పరీక్షకు 100శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కలెక్టర్ టీఎస్ దివాకర జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. అధికారులతో పాటు వైద్య సిబ్బంది, ఇతర సిబ్బందిని తనిఖీ చేసిన అనంత రం కేంద్రాలకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి పోలీసులు గస్తీ నిర్వహించా రు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి, గిరిజన ఆశ్రమ పాఠశాల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రా హుల్‌శర్మ సందర్శించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్

భూపాలపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

అనుమతి లేని కారణంగా తన ఫోన్‌ను వాహనంలో ఉంచి వెళ్లారు. పరీక్షల నిర్వహణ, సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 20 పరీక్ష కేంద్రాల్లో 3,449 మంది విద్యార్థులను కేటాయించగా 3,441 మంది హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, పరీక్ష కేంద్రాల సీఎస్‌లు ఉన్నారు. అలాగే కాటారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, గిరిజన గురుకుల బాలుర, ఆదర్శ హైస్కూల్ సెంటర్లను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి పరిశీలించారు.

అనుమతి లేని ఎరువులు, పురుగుమందులు కొనొద్దు

ఏటూరునాగారం, మార్చి 21 : అనుమతి లేని బయో ఎరువులు, పురుగు మందులను రైతులు కొని మోసపోవద్దని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండలకేంద్రంలో ఓ ఇంట్లో నిల్వచేసిన రూ.6 లక్షల విలువ చేసే 410 లీటర్ల బయో ఉత్పత్తులకు సంబంధించిన లిక్విడ్, 30 కిలోల ఘన పదార్థాలను ఆయన స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కందుచర్ల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వర్ రావు ఎలాంటి లైసెన్స్ లేకుండా రూ.6లక్షల విలువచేసే 410 లీటర్ల బయో ప్రొడక్ట్స్ లిక్విడ్స్, 30 కేజీల ఘన పదార్థాలను వెంకటాపురం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల ప్రాంతాల్లో రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో వ్యవసాయ శాఖ

పట్టుకున్న బయో మందులను చూపుతున్న ఏఎస్పీ

అధికారులతో కలిసి దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంకటేశ్వరావుకు చెందిన వ్యాను కూడా సీజ్ చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన వాటిల్లో కొన్నింటిపై లేబుల్స్ కూడా లేవని, మరి కొన్నింటికి ఉన్నప్పటికీ వాటికి ఎలాంటి లైసెన్స్ లేదన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని చెపాపరు. దాడుల్లో వ్యవసాయ శాఖ అధికారులు, ఎస్సై తాజుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 21 : వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బ తగలడానికి గల ప్రధాన కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని సూచించారు. ఉపాధి కూలీలకు నీడ సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర సేవలకు 108, 102 వాహనాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో మధుసూదన్, రవాణాశాఖ అధికారి సంధాని, వ్యవసాయ అధికారి వీరునాయక్, సహాయ కార్మిక శాఖ అధికారి వినోద, పశు సంవర్ధక శాఖ అధికారి కుమారస్వామి, డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

అడవిలో మట్టి తీస్తున్న జేసీబీ సీజ్

నిందితులపై కేసు నమోదు

పలిమెల, మార్చి21 : అడవిలో మట్టి తీస్తున్న జేసీబీని సీజ్ చేసినట్లు రేంజ్ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని లెంకలగడ్డ నార్త్ బీట్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో మట్టి తవ్వకాలు జరుగున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. లెంకలగడ్డ గోదావరి ఇసుకను తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీనిలో భాగంగానే క్వారీ నిర్వహణ రాకపోకలకు రహదారి నిర్మాణానికి మట్టి తరలిస్తున్నారన్నారు. పది ట్రాక్టర్ల మొరం తరలించే లోపే అక్కడకు చేరుకున్నట్లు తెలిపారు. అడవిలో చెట్లను తొలగించినట్లు చెప్పారు. మొరం తవ్విన వారిపై కేసు నమోదు చేసి, జేసీబీని సీజ్ చేసి విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

భూపాలపల్లి జిల్లాలో వర్షం

కృష్ణకాలనీ/మహదేవపూర్ (కాళేశ్వరం), మార్చి 21 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులతో కూడిన వాన కురిసింది. వేసవికాలం కావడంతో పొద్దంతా ఎండ వేడిమి, ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చిరుజల్లులతో కూడిన వర్షం సుమారు గంటపాటు కురిసింది. మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి, అంబట్‌పల్లి, కాళేశ్వరం, అన్నారం, సూరారంతో పాటు పలు గ్రామాల్లో కురిసిన వర్షంతో మిర్చి రైతులు దిగాలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను కల్లాలో ఆరబోసిన రైతులు ఆకాల వర్షానికి తడిసే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

మీ సేవ కేంద్రాల కమీషన్ పెంచాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 21 : ప్రతి నెలా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వచ్చే కమీషన్‌తో మీ సేవ కేంద్రాలు నడుపడం కష్టంగా ఉందని, వెంటనే కమీషన్ పెంచాలని మీ సేవ నిర్వహకులు, ఆపరేటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడే కొత్త కిరణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మీసేవ కేంద్రాల నిర్వాహకులు, ఆపరేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాల్లో మీ సేవ కేంద్రాల ఆపరేటర్లకు తగిన మర్యాద ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సెంటర్ వారు చేసిన తప్పులకు మీ సేవ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు బెదిరిస్తూ తమ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని, వెంటనే మీ సేవ ఆపరేటర్స్ యూనియన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా హెల్త్ కార్డులు అందించాలని కోరారు. జిల్లా జనరల్ సెక్రటరీ సిరికొండ రామారావు, వైస్ ప్రెసిడెంట్ గౌరోజు విష్ణుమూర్తి, జాయింట్ సెక్రటరీ తోట అనూష, అడిషనల్ సెక్రటరీ ఇంతియాజ్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల, మార్చి 21 : మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌కు చెందిన మోత్కూరి కుమారస్వామి ఇటీవల మృతి చెందాడు. విషయం 10వ తరగతి 2001 బ్యాచ్‌కు చెందిన అతడి మిత్రులు రూ.20 వేలు శుక్రవారం ఆ కుటుంబానికి అందజేశారు. భవిష్యత్తులో మృతుడి పిల్లలకు చదువుపరంగా అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. గంగాధర్ రాజు, సతీశ్, రమేశ్, శ్రీశైలం, రాజేందర్, రాజు, ప్రభాకర్, శైలేందర్, సతీశ్, అశోక్, రవీందర్, సతీశ్, మహేందర్ ఉన్నారు.

బెట్టింగ్ గ్యాంబ్లింగ్‌కు దూరంగా ఉండాలి

ములుగురూరల్, మార్చి 21 : ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీ మనీ హామీలు, బెట్టింగ్ యాప్‌లపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌లో పాల్గొన్న వారు, ప్రోత్సహించిన వారు, సహకరించిన వారిపై తెలంగాణ గేమింగ్ చట్టం 2017ను అనుసరించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ప్రజల దృష్టికి వచ్చిన బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను 8712672222కు ఫార్వర్డ్ చేసి సమాచారాన్ని అందించవచ్చునని డీఎస్పీ పేర్కొన్నారు.

తాగి పట్టుబడిన వారితో సామాజిక సేవ

ములుగురూరల్, మార్చి 21 : ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలను నడుపుతూ డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారితో 4 గంటల పాటు సామాజిక సేవ చేయించాలని సబ్ కోర్టు జడ్జి కన్నయ్యలాల్ శుక్రవారం తీర్పు వెలువరించారు. దీంతో ఎస్సై వెంకటేశ్వర్‌రావు వారితో ములుగు ప్రభుత్వ దవాఖాన పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేయించారు. కమ్యూనిటీ సర్వీస్ చేయించడం వల్ల వాహనదారుల్లో మార్పు వస్తుందని ఎస్సై వివరించారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ ఉన్నారు.

అటవీ దినోత్సవం నిర్వహణ

ములుగురూరల్, మార్చి21 : ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన రంజిత్, శిరీష, మరియం, రబియా, సుచిత్ర, శ్రావ్య, శృతి, పునిత, యమునకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులే బుద్ధిచెప్తారు

ఏటూరునాగారం, మార్చి 21 : రాజీవ్ యువ వికాస పథకం సక్రమంగా అమలు కాకపోతే నిరుద్యోగులే ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు వావిలాల కిశోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పథకం పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను నిలువు దోపిడీ చేసే పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. ఒక కుటుంబంలో రేషన్ కార్డులో కనీసం నలుగురి వరకు నిరుద్యోగులుంటే పథకం ఎవరికి వర్తిస్తుందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేయకుండా ఇలాంటి పథకాలు పెడితే ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. వెంటనే రేషన్ కార్డు నిబంధన తొలగించి, ఓ ప్రత్యేక వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ తీసుకోవాలన్నారు.

గోమాతకు దహన సంస్కారాలు

వెంకటాపూర్, మార్చి 21 : గోమాత మృతి చెందగా దహన సంస్కారాలు నిర్వహించారు. మండలంలోని పాలంపేట గ్రామానికి బోడ మహేందర్ –రమ దంపతులు పెంచుకుంటున్న ఆవు నాలుగేండ్ల క్రితం దూడకు జన్మనివ్వగా దానిని పెంచుకుంటున్నారు. శుక్రవారం ఉదయం ఆవు ఆరుస్తూ ఒక్కసారిగా చలనం కోల్పోగా పశువైద్యుడిని పిలిపించగా అప్పటికే మృతిచెందిందని తెలిపారు. దీంతో దానిని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు చేశారు.

పీఏసీఎస్ వ్యవహారంపై విచారణ

తాడ్వాయి, మార్చి 21 : తాడ్వాయి పీఏసీఎస్ వ్యవహారంపై శుక్రవారం దర్యాప్తు అధికారి ఎం రాజేశ్ కార్యాలయానికి వచ్చారు. పీఏసీఎస్ పరిధిలో యూరియా అమ్మకాలు, ధాన్యం కొనుగోలు వివరాలను సేకరించారు. చైర్మన్‌తో పాటు సీఈవో అక్రమాలకు పాల్పడ్డారంటూ డైరెక్టర్ ఇందారపు లాలయ్య ఉన్నతాధికారులు రెండు నెలల క్రితం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సైతం రాజేశ్ దర్యాప్తు చేపట్టారు. యూరియా బస్తాలను అధిక ధరలను విక్రయించడంతో పాటు ఒక్కో రైతు వద్ద ఎస్‌బీ అకౌంట్లను ప్రారంభించేందుకు రూ.1700 వసూలు చేసినట్టు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సక్రమంగా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారనే ఫిర్యాదుతో విచారణ చేశారు. కాగా, విచారణకు చైర్మన్ హాజరు కాలేదు. సుమారు రూ.40 లక్షలు అధ్యక్ష, కార్యదర్శులు వినియోగించుకున్నారని డైరెక్టర్ లాలయ్య ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమకు కమీషన్లు ఇవ్వకుండా సొంతానికి వాడుకున్నారని విచారణ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వేటగాళ్ల ఉచ్చులో దుడ్డె

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 21 : వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు దుడ్డె చిక్కుకొని విలవిలాడింది. ఈ ఘటన మండలంలోని కుదురుపల్లి అటవీక్షేత్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగవేయిన బాపునకు చెందిన దుడ్డె మేత కోసం సమీప అటవీ క్షేత్రాలకు వెళ్లింది. అక్కడ వేటగాళ్లు వన్యప్రాణుల కోసం అమర్చిన ఉచ్చుకు చిక్కుకుంది. గమనించిన కాపరి తీగలను తొలగించి కాపాడాడు. అటవీశాఖ అధికారులు స్పందించి వేటగాళ్లపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక

మహదేవపూర్, మార్చి 21 : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగం నుంచి 100 ,400 మీటర్ల పరుగు పందెంలో బద్దెల విష్ణుప్రియ, వసంత అనుజ్ఞ, మాడిగ అక్షిత, పెద్ది మధులత, బాలుర విభాగంలో అభిరాం, సుంకరి ప్రద్యూన్ ఎంపికైనట్లు పీడీ గురుసింగ పూర్ణిమ తెలిపారు. ఈ నెల 23 న హైదరబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు. శుక్రవారం హెచ్ఎం సరిత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

బీరసాగర్ అడవుల్లో కార్చిచ్చు

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 21 : మండలంలోని బీరసాగర్ అటవీక్షేత్రాల్లో శుక్రవారం కార్చిచ్చు రగులుకుంది. మంటలు అడవుల్లో వ్యాప్తి చెందడంతో మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు వచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ క్షేత్రాలపై పటిష్ట